

## అగ్రగామిగా ట్రిపుల్ఐటీ

బాసర ట్రిపుల్ఐటీని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని ఇన్చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. వర్సిటీని శుక్రవారం సందర్శించారు.

8లో▸



## వేంకటేశ్వరస్వామి జాతర

ఖానాపూర్ మండలం సుర్జాపూర్లో శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి జాతర నిర్వహించారు.

9లో▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.1 /23.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. తుపాను ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

# మాస్టార్ల ముందు జాగ్రత్త!?

- 'యూబిట్' దందాపై ఈడీ ఫోకస్
- వారాల తరబడి స్కూళ్లకు రాని ఉపాధ్యాయులు
- సెలవులో కొందరు.. అనధికారిక సెలవులో మరికొందరు..
- ముందస్తు బెయిల్ కోసం యత్నాలు
- పట్నంలో చక్కర్లు కొడుతున్న 'స్టార్లు'



నిర్మల్: యూబిట్ దందా కేసులో జిల్లా పోలీసులు వరుస అరెస్టులు.. ఇటీవల ఈడీ(ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్) కూడా ఎంటర్ కావడంతో ఈ దందాతో సంబంధం ఉన్న మా'స్టార్లు' ముందు జాగ్రత్త పడుతున్నారు. ప్రధానంగా ఇందులో త్రీ, ఫోర్, ఫైవ్స్టార్లుగా ఉన్న చాలామంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డెన్లు, వ్యాపారులు తమను అరెస్ట్ చేయకుండా ఉండేందుకు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తానూరు, కుభీర్, లక్ష్మణచాంద తదితర మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తీసుకోవడానికి హైదరాబాద్లో ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొందరు నిర్మల్-హైదరాబాద్కు చక్కర్లు కొడుతున్నారు. కొంతమంది అధికారికంగా లీవ్లు పెడుతుండగా, కొందరు మాత్రం అధికారులను మేనేజ్ చేసుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా బడికి డుమ్మా కొడుతున్నట్లు తెలిసింది.

**ఈడీ రాకతో..**

యూబిట్ దందాలో జిల్లా పోలీసులు కేసులు పెట్టడం, అరెస్టులు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. తాజాగా ఈ కేసులు ఆర్థిక నేరాలకు పాల్పడిన అనుమానాలు రావడంతో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా ఎంటరైంది. ఈమేరకు కేసు పూర్తి వివరాలు కావాలని జిల్లా పోలీసులకు లేఖ రాయడం, వారు కూడా వివరాలన్నీ ఇవ్వడం తెలిసిందే. ఇక ఈ నెలాఖరు వరకు ఈ కేసుపై ఈడీ కదలిక ఉండనున్నట్లు సమాచారం. ఈక్రమంలోనే జిల్లాకు చెందిన యూబిట్దందా స్టార్హోల్డర్లు ముందస్తు బెయిల్ కోసం వెళ్లినట్లు తెలుస్తోంది.

**అధికారికంగానేనా..!?**

జిల్లాలో విద్యావ్యవస్థ గాడితప్పిన విషయం అందరికీ తెలిసిందే. ఉన్నతాధికారులు సైతం పర్యవేక్షించకపోవడం, ఏకంగా ఉపాధ్యాయులు అరెస్టయినా పెద్దగా శాఖాపరంగా కదలికలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ దందాలు బడుల్లో యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా అరెస్టుల నుంచి తప్పించుకోవడానికి, ముందస్తు బెయిల్ కోసం కొంతమంది బడులకు డుమ్మాలు కొడుతున్నారు. ఇందులో కొందరు అధికారికంగా లీవ్లు పెడుతున్నా.. కొంతమంది తీరు మాత్రం అనుమానాస్పదంగా ఉంది. వీరు జిల్లా అధికారులను మేనేజ్ చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గతంలో యూబిట్ దందా జోరుగా ఉన్నప్పుడు సైతం చాలామంది నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా విదేశాలకు వెళ్లివచ్చిన తీరుపై ఇప్పటికీ విమర్శలు వస్తూనే ఉన్నాయి.

**గాడిన పడేనా..**

పదో తరగతి ఫలితాల్లో నిర్మల్ జిల్లా వరుసగా రెండేళ్లపాటు రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచింది. ఈసారి పరిస్థితి ఎలా ఉంటుందోనన్న చర్చ నడుస్తోంది. ఓవైపు యూబిట్ దందా కేసులు, మరోవైపు పర్యవేక్షణ లోపాలు సర్కారు బడి చదువులపై ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికీ సమయం మించిపోలేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిపెడితే విద్యావ్యవస్థ గాడిన పడుతుందని వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ దందాలు, కేసులను పక్కన పెట్టి, తరగతి గదిలో తమ ఎదురుగా కూర్చున్న పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందంటున్నారు. తమ స్వార్థం, స్వలాభం కోసం విద్యార్థుల జీవితాలను పణంగా పెట్టడం సరికాదన్న వాదనలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందిస్తారా..! సర్కారు బడిని గాడిన పెడతారా..! అనేది చూడాలి.

**అరెస్టు కాకుండా..**

అత్యాశకు పోయి ఇప్పుడు ఇబ్బందులు పడుతున్న అనేకమంది 'స్టార్లు' ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నారు. యూబిట్ దందాలో వస్తున్న లాభాలకు ఆశపడి స్టార్లుగా మారిన మాస్టార్లు ఇప్పుడు కోర్టులు, బెయిళ్లంటూ పట్నం చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి. మూడు నెలలుగా ఈ కేసులో ఎనిమిది మంది అరెస్టు కావడం, వారాల తరబడి వాళ్లు జైళ్లలోనే ఉండటం, సస్పెన్షన్లకు గురికావడం.. స్టార్లను ఆందోళనకు గురిచేసింది. ప్రస్తుతానికి ఈకేసులో అరెస్టులు ఉండకపోవచ్చన్న సమాచారం ఉన్నప్పటికీ చాలామంది ముందుజాగ్రత్త పడుతున్నారు. పలువురు టీచర్లతోపాటు ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు, ఉద్యోగులు, వ్యాపారులు సైతం ముందస్తు బెయిల్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. భైంసా డివిజన్లోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇప్పటికే ముందస్తు బెయిల్ తీసుకున్నట్లు తెలిసింది.

గ్రూప్-2, 3 పరీక్షలకు

## ఏర్పాట్లు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న అధికారులు

నిర్మల్చైన్గేట్: గ్రూప్-2, 3 పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తిచేయాలని టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ టీజీపీఎస్సీ ప్రధాన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రూప్-2, 3 పరీక్షలు అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్- 3, డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్- 2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షకు సంబంధించి జిల్లా నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ వ్యవహరిస్తారన్నారు. అన్ని జిల్లాల్లో స్ట్రాంగ్రూంలను గుర్తించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సరిపడా ఫర్నిచర్, విద్యుత్, ఇతర సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. టీజీపీఎస్సీ నిబంధనలకు లోబడి పరీక్ష కేంద్రాలను కేటాయించాలన్నారు. పరీక్ష నిర్వహణకు సరిపడా సిబ్బందిని సమకూర్చుకోవాలని ఆదేశించారు. అధికారులు పరీక్ష కేంద్రాలను సందర్శించి సౌకర్యాలు పరిశీలించిన తర్వాతనే అనుమతులు ఇవ్వాలని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్అహ్మద్ మాట్లాడుతూ గ్రూప్-2, 3 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పకడ్బందీగా పరీక్ష కేంద్రాలను ఎంపిక చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రాంతీయ సమన్వయకర్త గంగారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**న్యూస్రీల్**

## వాహనాల పంపిణీకి లబ్ధిదారుల ఎంపిక



దివ్యాంగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజేందర్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్చైన్గేట్: అర్హులైన దివ్యాంగులకు రిట్రోఫిటెడ్ మోటరైజ్డ్ వాహనాల పంపిణీకి కలెక్టరేట్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆధ్వర్యంలోని స్క్రీనింగ్ కమిటీ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ శుక్రవారం చేపట్టింది. అధికారులు దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్, డీఆర్డీవో విజయలక్ష్మి, ప్రాంతీయ రవాణా అధికారి దుర్గాప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

## నేడు అండర్-14 జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు

లక్ష్మణచాంద: ఖోఖో అండర్-14 జిల్లాస్థాయి జట్ల ఎంపిక పోటీలు శనివారం లక్ష్మణచాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని హెచ్ఎం రాజునాయక్ తెలిపారు. జిల్లాస్థాయి బాలుర, బాలికల జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు.

## జోనల్ స్థాయి చెస్ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని



కదం ప్రతిభ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న కదం ప్రతిభ జోనల్ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-17 విభాగంలో వెంగ్వాపేట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చింది. దీంతో జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్వో వీణ తెలిపారు.

# పాత కాంటాలతో పంట తూకం!



స్టాంపింగ్ గడువు ముగిసిన కాంటాను వినియోగిస్తున్న దృశ్యం



గతేడాది వేసినట్లు ఉన్న స్టాంపింగ్ ముద్ర

ఈ చిత్రంలోని ఎలక్ట్రానిక్ కాంటా భైంసా మండలం మాటేగాంలోని ప్రభుత్వ సోయా కొనుగోలు కేంద్రంలోనిది. ఇటీవల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. రైతులు సోయా విక్రయిస్తున్నారు. అయితే ఈ ఎలక్ట్రానిక్ కాంటాను పరిశీలించగా, స్టాంపింగ్ గడువు ముగిసినట్లు ఉంది. కొనుగోళ్లకు ముందే కాంటాను పరిశీలించి, సంబంధిత అధికారులు స్టాంపింగ్ వేయాలి. ఆ తర్వాతనే తూకం ప్రారంభించాలి. కానీ, స్టాంపింగ్ గడువు ముగిసిన కాంటాపైనే తూకం వేస్తుండడంతో కచ్చితత్వంపై రైతుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- కాంటాలకు స్టాంపింగ్ చేయని వైనం
- జిల్లాలో ప్రారంభమైన సోయా కొనుగోళ్లు
- కచ్చితత్వంపై అనుమానాలు
- నష్టపోతామంటున్న రైతులు

భైంసాటౌన్: రైతులు ఖరీఫ్లో పండించిన పంట ఉత్పత్తులు చేతికొస్తున్నాయి. ఇప్పటికే సోయా పంట చేతికి రాగా, చాలాచోట్ల కోతలు పూర్తయ్యాయి. మక్కలు, ఇతర పంట ఉత్పత్తులు మార్కెట్లో, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. త్వరలో వరి ధాన్యం కొనుగోళ్లు కూడా ప్రారంభం కానున్నాయి. మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సోయా కొనుగోళ్లు జరుగుతున్నాయి. భైంసా, కుభీర్, తానూర్, ముథోల్, సారంగపూర్ కేంద్రాల్లో తూకాలు మొదలు కాగా, త్వరలోనే కుంటాల, దిలావర్పూర్లోనూ ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. క్వింటాలుకు రూ.4,892 మద్దతు ధర చెల్లిస్తుండడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

**కాంటాలకు స్టాంపింగ్ ఏది..**

ఇదిలా ఉండగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తుల తూకాలకు ఎలక్ట్రానిక్ కాంటాలను వినియోగిస్తున్నారు. అయితే, ముందుగా కాంటాలను పరిశీలించి, కచ్చితమైన తూకం సరిచూసి, సంబంధిత అధికారులు స్టాంపింగ్ వేయాలి. దీంతో రైతులు తూకాల్లో మోసపోకుండా ఉంటుంది. అయితే, జిల్లావ్యాప్తంగా ఇప్పటికే సోయా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా, కొన్నిచోట్ల కాంటాలకు అధికారులు స్టాంపింగ్ వేయలేదు. గడువు ముగిసిన కాంటాలనే వినియోగిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ఈ పరిస్థితి ఉంటే, ఇక ప్రైవేట్ వ్యాపారుల కాంటాల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పట్టణంలోని ఏఎంసీ మార్కెట్యార్డుకు ప్రతీరోజు వందల సంఖ్యలో సోయా లాట్లు విక్రయానికి వస్తున్నాయి. కొనుగోళ్లకు ముందే కాంటాలు పరీక్షించాల్సిన అధికారులు సకాలంలో చేయకపోవడంతో రైతులు తూకాల్లో నష్టపోయే అవకాశముంది.

**సకాలంలో చేస్తేనే ప్రయోజనం...**

ప్రస్తుతం సోయా కొనుగోళ్లు జరుగుతుండగా, కొన్నిచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు సైతం ప్రారంభవుతున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలే కాకుండా, వ్యాపారులు సైతం కొనుగోళ్లు చేపడతారు. ఈ నేపథ్యంలో మార్కెటింగ్, తూనికలు, కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు జరిపి రైతులు తూకాల్లో మోసపోకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే ప్రారంభిస్తున్న నేపథ్యంలో సకాలంలో కాంటాలను పరీక్షించి, మోసాలకు తావులేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

**మోసాలు అరికట్టాలి..**

సోయా కొనుగోళ్లలో కొందరు వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. వారు వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాంటాలపై రైతులకు సందేహాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు రైతుల సమక్షంలో కాంటాలను పరీక్షించాలి. – శివాజీ, రైతు, సిద్దూర్

**స్టాంపింగ్ వేయాలని కోరాం..**

భైంసా ఏఎంసీ పరిధిలో సోయా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. దీంతో ఎలక్ట్రానిక్ కాంటాలకు స్టాంపింగ్ వేయాలని సంబంధిత శాఖ అధికారులను కోరాం. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు ప్రారంభించాం. – పురియా, ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి, భైంసా

**త్వరలోనే స్టాంపింగ్ చేస్తాం..**

ఏఎంసీల కాంటాలకు స్టాంపింగ్ చేయాలని మా దృష్టికి తెచ్చారు. ఇప్పటికే కొన్నిచోట్ల స్టాంపింగ్ చేశాం. కరీంనగర్ జిల్లా బాధ్యతలు ఉండడంతో జాప్యం జరుగుతోంది. త్వరలోనే కాంటాలను పరీక్షించి స్టాంపింగ్ చేస్తాం. – భూలక్ష్మి, తూనికలు, కొలతలశాఖ అధికారి

# మాకొద్దీ ఇథనాల్ ఫ్యాక్టరీ



ప్రజాగళం సభలో అభివాదం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

- ముక్తకంఠంతో నినదించిన దిలావర్పూర్ రైతులు
- ప్రజాగళం సభకు తరలి వచ్చిన రైతులు, మహిళలు
- మద్దతు పలికిన ప్రజాసంఘాల నేతలు

దిలావర్పూర్: పచ్చని పంటచేలు, రెండు పంటలు పండే బంగారు భూముల మధ్యలో విషంచిమ్మే ఇథనాల్ పరిశ్రమ తమకు వద్దని దిలావర్పూర్ మండల రైతులు, ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. ప్రజాగళం పేరుతో శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక సభకు హాజరైన ప్రజాసంఘాల నాయకులు రైతులు, ప్రజలకు సంఘీభావం తెలిపారు. ఫ్యాక్టరీ నిర్మాణా నికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ము ఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ మన బతుకుదెరువే పంట పొలాలన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే అని పేర్కొన్నారు. ఈ ప్రాంత సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు. దిలావర్పూర్ మండలానికి గతంలో పలుమార్లు వచ్చానన్నారు. శాంతియుతంగా తెలంగాణ సాధించినట్లుగా, సమస్యలను కూడా శాంతిమార్గంలో పరిష్కరించుకుందామన్నారు. స్థానిక రైతుల కష్టాలు తనకు తెలు సని పేర్కొన్నారు. రైతులు తాము నమ్ముకున్న భూ ములు, తమ పల్లెలను కాపాడుకునేందుకు చేసిన సంకల్పం బలమైందని తెలిపారు. రైతుల పక్షాన ఒక కమిటీని సైతం వేసినట్లు తెలిసిందన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

**కాలుష్య పరిశ్రమలు వద్దు..**

పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య మాట్లాడుతూ ఇప్పటికే ఇథనాల్ ఫ్యాక్టరీలు ఉన్నచోట ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నీళ్లు, భూములు, పంటలను కలుషితం చేసే పరిశ్రమలను గ్రామాల్లో ఏర్పాటు చేయొద్దని సూచించారు. రైతుల గోడును కలెక్టర్ నుంచి కిందిస్థాయి అధికారి వరకు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల, ఆస్పత్రి కావాలని అడిగితే ఇవ్వని పాలకులు, ఇలాంటి పరిశ్రమలకు మాత్రం వెంటనే అనుమతి ఇస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

**ముందే మేల్కొన్నారు...**

చిత్తనూరులో ఏర్పాటు చేసిన ఇథనాల్ ఫ్యాక్టరీతో తాము పడుతున్న గోసను అక్కడి నుంచి వచ్చిన అధ్యాపకుడు లక్ష్మయ్య వివరించారు. తాను అధ్యాపకుడిగా పనిచేస్తున్నానని, తనను అధికారులు ఇబ్బంది పెట్టారని తెలిపారు. అయినా తాను ప్రజల పక్షాన ఉంటానని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ కారణంగా తమ ప్రాంతం పూర్తిగా కలుషితమైందని తెలిపారు. దిలావర్పూర్ రైతులు, ప్రజలు అప్రమత్తమయ్యారని అభినందించారు. అందరూ ఏకతాటిపై నిలవాలని సూచించారు.

**ఘన స్వాగతం..**

ఇదిలా ఉండగా ప్రజాగళం సభకు హాజరైన అతిథులకు ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు, గ్రామస్తులు, రైతులు ఘన స్వాగతం పలికారు. కళాకారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. సభా ప్రాంగణానికి వచ్చే రైతులు, మహిళలు ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా సంతకాలు చేశారు. ఇందులో పర్యావరణ వేత్త, శాస్త్రవేత్త బాబురావు, టీపీజేఏసీ కోకన్వీనర్ కనెగంటి రవి, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబటి నాగయ్య, వివిధ సంఘాల నాయకుల కొండల్రెడ్డి, వేణుగోపాల్, అశోక్కుమార్, భుజంగరావు, చలపతిరావు, మోహన్రెడ్డి, సర్దార్ వినోద్కుమార్, నంది కొమురయ్య పాల్గొన్నారు.

**పటిష్ట బందోబస్తు..**

ప్రజాగళం సభ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్పీ జానకీషర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి నుంచే పోలీసు పహారా కొనసాగింది. డీఎస్పీ గంగారెడ్డి, సీఐ రామకృష్ణ, జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్సైలు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు.



ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని నినదిస్తున్న దిలావర్పూర్-గుండంపల్లి గ్రామాల రైతులు, మహిళలు

## నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్చైన్గేట్: నూతన పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని, వారు పెట్టుకున్న దరఖాస్తులను త్వరగా పరిశీలించి అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో కలెక్టరేట్లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులు, అనుమతి, తిరస్కరణకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీఎస్ ఐపాస్ వెబ్సైట్లో నూతన పరిశ్రమల కోసం వచ్చిన దరఖాస్తులకు అనుమతుల జారీ పారదర్శకంగా ఉండాలన్నారు. నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. తిరస్కరిస్తే అందుకు కారణాలు దరఖాస్తు ఫారంలో పొందుపర్చాలని సూచించారు. పీఎం విశ్వకర్మ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల నుంచి దరఖాస్తులు ఎక్కువ వచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ నరసింహారెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్గోపాల్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాజేశ్వర్గౌడ్ పాల్గొన్నారు.

# మత్స్యకారుల సంక్షేమానికి కృషి

కడెం: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్తో కలిసి కడెం ప్రాజెక్ట్లో చేప పిల్లలను శుక్రవారం విడుదల చేశారు. ఈసందర్భంగా చైర్మన్ సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అండగా నిలుస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీడ్ కాంట్రాక్టులు ఆంధ్రా వారికి అప్పగించి భారీ మోసాలకు పాల్పడిందని తెలిపారు. చేప పిల్లల పంపిణీని కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా చేపడుతుందన్నారు. కడెం ప్రాజెక్ట్లో 9 లక్షల చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ చెరువులు, కుంటల నుంచి వ్యవసాయానికి సాగు నీరందడంతోపాటుగా, మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. మండల కేంద్రంలో త్వరలోనే చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మండలంలోని పెద్దూర్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లేశ్, పీఏసీఎస్ చైర్మన్ శైలజరమేశ్రావు, గొల్ల వెంకటేశ్, భూషణ్, శంకర్, శ్రీనివాస్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



కడెం ప్రాజెక్ట్లో చేప పిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, చైర్మన్ సాయికుమార్



బోటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, అధికారులు

**బోటింగ్ చేసిన ఎమ్మెల్యే, చైర్మన్**

కడెం పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కడెం ప్రాజెక్ట్లో బోటింగ్ చేశారు. ప్రాజెక్ట్ అందాలను తిలకిస్తూ కాసేపు సరదాగా గడిపారు. వీరివెంట ఆర్డీవో రత్నకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ ఉన్నారు.

## దివ్యాంగులపై దాడులు ఆపాలి

నిర్మల్టౌన్: దివ్యాంగులపై జరుగుతున్న దాడులను ఆపాలని, ప్రత్యేక చట్టాల ప్రకారం పోలీసులు కేసులు నమోదు చేయాలని తెలంగాణ దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాట్ల సాయన్న డిమాండ్ చేశారు. నిర్మల్ ప్రెస్క్లబ్లో శుక్రవారం మాట్లాడారు. కడెం మండలం పెర్కపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడైన సాదు రమేశ్పై అదే గ్రామానికి చెందిన రఘుపతి, అంజన్న, రఘు, గణేశ్ మద్యం మత్తులో ఈ నెల 12న దాడిచేశారని తెలిపారు. ఈ విషయంపై కడెం పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. దివ్యాంగుల ప్రత్యేక చట్టాలు 2016 సెక్షన్ 92 ప్రకారం బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరారు. సమావేశంలో క్రాంతికుమార్, మధుకర్, ఇషాక్ అలీ, నారాగౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.

# ఎఫ్‌డీవో నియామకం ఎప్పుడో..!

- డివిజన్‌లో పెరుగుతున్న స్మగ్లింగ్
- సిబ్బంది కొరతతో సతమతం



ఇటీవల అటవీ అధికారులు పట్టుకున్న బెడ్

**జన్నారం:** అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ సిబ్బంది పనితీరును పర్యవేక్షించే జన్నారం ఎఫ్‌డీవో పోస్టు ఖాళీగా ఉంది. దీంతో జన్నారం అటవీ డివిజన్‌లో కలప స్మగ్లింగ్ పెరిగిపోతోంది. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో నాలుగు డివిజన్‌లు ఏర్పాటు చేసి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పులుల ఆవాసానికి అనువైన ప్రదేశంగా ఉన్న జన్నారం అటవీ డివిజన్‌లో అధికారుల ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. జన్నారం అటవీ డివిజన్‌లో మూడు అటవీ రేంజ్‌లు, 13సెక్షన్‌లు, 40 అటవీ బీట్‌లు ఉన్నాయి. వీటితోపాటు అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఒక ఫారెస్టు డివిజనల్ అధికారి(ఎఫ్‌డీవో) ఉన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో ఎఫ్‌డీవో మాధవరావు హైదరాబాద్‌లోని ఆ శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. మంచిర్యాల డీఎఫ్‌వోకు బాధ్యతలు అప్పగించారు. ఆయన నిత్యం ప్రభుత్వ, శాఖపరమైన పనుల్లో తీరిక లేకుండా ఉండడం వల్ల అప్పుడప్పుడు డివిజన్‌కు వచ్చి వెళ్తుంటారు. దీంతో కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. గత ఎఫ్‌డీవో చేపట్టిన కార్యక్రమాలతో డివిజన్‌లో కలప స్మగ్లింగ్, వన్యప్రాణుల వేట తగ్గింది. కింది స్థాయి సిబ్బంది నిత్యం విధుల్లో ఉండేవారు. ఎఫ్‌డీవో బదిలీతో గతంలో చేపట్టిన కార్యక్రమాలు ఏడాది కాలంగా నిలిచిపోయాయి. కలప స్మగ్లింగ్ జరిగే జన్నారం అటవీ డివిజన్‌లో ఏడాదిగా రేంజ్ అధికారులు ఇన్‌చార్జిలుగా ఉండడం గమనార్హం. ఇందన్‌పల్లి రేంజ్ అధికారిగా మంచిర్యాల డీఆర్వో హఫీజొద్దీన్ నాలుగేళ్లుగా పని చేసి లక్సెట్టిపేటకు బదిలీపై వెళ్లారు. జన్నారం రేంజ్ అధికారి సెలవుపై వెళ్లడంతో కొన్ని రోజులు ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హఫీజొద్దీన్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరించగా.. ప్రస్తుతం తాళ్లపేట్ రేంజ్ అధికారి సుష్మారావు ఇన్‌చార్జి రేంజ్ అధికారిగా ఉన్నారు.



కవ్వాల్ సెక్షన్‌లో స్మగ్లర్లు నరికివేసిన టేకు చెట్లు (ఫైల్)

## పెరుగుతున్న స్మగ్లింగ్

జన్నారం అటవీ డివిజన్‌లో గతంతో పోలిస్తే స్మగ్లింగ్ పెరుగుతోంది. ఇటీవల పలు ప్రాంతాల్లో అధికారులు కలప పట్టుకున్న సంఘటనలే నిదర్శనం. డివిజన్‌లోని కవ్వాల్ సెక్షన్, మహ్మదాబాద్, తాళ్లపేట్ రేంజ్‌లోని పలు ప్రాంతాల నుంచి స్మగ్లింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. మహ్మదాబాద్ సెక్షన్‌లోని పలు ప్రాంతాల్లో స్మగ్లర్లు అధికారుల కళ్లుగప్పి కలప తరలిస్తున్నారు. అటవీ ప్రాంతాల నుంచి చింతగూడెం సమీపం నుంచి గోదావరి దాటిస్తున్నట్లు సమాచారం. గోదావరి ప్రాంతాలైన తపాలపూర్, రాంపూర్, చింతగూడ గ్రామాల గుండా కొందరు గుట్టు చప్పుడు కాకుండా కలప తరలిస్తున్నారు. కవ్వాల్ సెక్షన్ నుంచి ద్విచక్ర వాహనాల ద్వారా తరలిస్తున్నట్లు తెలిసింది. కొందరు వ్యక్తులు ఎడ్లబండ్ల ద్వార దుంగలను తరలిస్తూ రాత్రికి రాత్రే మిషన్ల ద్వారా కోయిస్తున్నారు. కాగా, ఎఫ్‌డీవో నియామకంపై కవ్వాల్ టైగర్‌జోన్ ఎఫ్‌డీపీటీ శాంతారాంను సంప్రదించగా.. ఫారెస్ట్ డివిజన్ అధికారి బదిలీలు, నియామకాలు ప్రభుత్వం చేతిలో ఉంటాయని, త్వరలో నియామకం అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

### స్థానికంగా ఉండని అధికారులు

జన్నారం అటవీ డివిజన్‌లోని కవ్వాల్ అటవీ సెక్షన్‌లో అధికారులు స్థానికంగా ఉండడం లేదు. ఈ సెక్షన్‌లో నాలుగు అటవీ బీట్‌లు ఉన్నాయి. విస్తీర్ణం, స్మగ్లింగ్ పరంగా పేరుంది. గతంలో సెక్షన్ అధికారి కవ్వాల్ సెక్షన్‌కు డీఆర్వోను నియమించారు. డీఆర్వోగా బాధ్యతలు చేపట్టిన హేమలత 15రోజులకే సెలవుపై వెళ్లారు. నలుగురు బీట్ అధికారుల్లో ఇద్దరు సెలవుపై వెళ్లడంతతో ప్రస్తుతం ఒక ఇన్‌చార్జి సెక్షన్ అధికారి, ఇద్దరు బీట్ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో బీట్ అధికారి ప్రణయ్ డీఎస్సీలో ఎంపిక కాగా.. ఆయన కూడా ఈ ఉద్యోగాన్ని వదిలి ఉపాధ్యాయ పోస్టులో చేరే అవకాశం ఉంది.

### మే నుంచి అక్టోబర్ వరకు

ఈ ఏడాది మే నుంచి అక్టోబర్ వరకు డివిజన్‌లో పలు ప్రాంతాల నుంచి కలప తరలించగా అధికారులు పట్టుకున్నారు. మచ్చుకు కొన్ని సంఘటనలు మేలో కవ్వాల్ అటవీ సెక్షన్ రాయికుంట బీట్‌లో స్మగ్లర్లు టేకు చెట్లను రంపంతో కోసి దుంగలను తీసుకెళ్లగా ఒకరిని గుర్తించి కేసు చేశారు.

- జూన్ 1న పడిపెల్లి బీట్‌లో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న రెండు టేకు చెట్లను రంపంతో కోయగా విద్యుత్ తీగలపై పడి మంటలు లేవడంతో రంపం, కలప అక్కడే వదిలి వెళ్లారు. ఈ సంఘటనలో ఇద్దరిపై కేసు చేశారు.
- జూన్ 6న కలప స్మగ్లింగ్ ఆరోపణలపై వెడ్మ లక్ష్మణ్‌ను అరెస్ట్ చేశారు.
- జూలై 25న కిష్టాపూర్ గ్రామంలో కుల్వకాయల మల్లేశ్ ఇంట్లో సోదాలు చేసి రూ.8,463 విలువైన కలప పట్టుకున్నారు.
- ఆగస్టు 21న కిష్టాపూర్ గ్రామంలో గాజుల మల్లేశ్ ఇంట్లో రూ.15 వేలు విలువైన 11 టేకు చెక్కలు, 4 దిమ్మెలు పట్టుకున్నారు.
- ఆగస్టు 2న తాళ్లపేట్ అటవీ రేంజ్ ఊట్ల బీట్ పరిధిలో అటవీశాఖ అధికారులు వెంబడించి రూ.34 వేల విలువైన 3 టేకు సైజులు 8 వాసాలు పట్టుకున్నారు.
- సెప్టెంబర్ 23న జన్నారం మండల కేంద్రంలోని శ్రీలంక కాలనీలో రూ.14 వేలు విలువైన నిల్వ ఉన్న కలప పట్టుకున్నారు.

వీటి ఆధారంగా పట్టుబడకుండా ఎంతో కలప తరలిపోతున్నట్లు తెలుస్తోంది.

ఈ విషయంలో ఉన్నత అధికారులు దృష్టి సారించి ఎఫ్‌డీవో నియామకం చేసి, పెరుగుతున్న స్మగ్లింగ్ నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## క్లుప్తంగా

### నకిలీ బంగారం ముఠా సభ్యుడి అరెస్ట్

**ఆదిలాబాద్‌టౌన్:** అంతర్రాష్ట్ర నకిలీ బంగారం ముఠా సభ్యుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఈనెల 6న పట్టణంలోని రాధాకృష్ణ లాడ్జిలో గల లెడ్జర్ బుక్‌లను ఎత్తికెళ్లిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించగా, శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా డోన్ మండలం కొత్తబుర్జుకు చెందిన మరో నిందితుడు ఎరుకల సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. కర్ణాటకలోని బల్లారికి చెందిన మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు

### అంగన్‌వాడీలో కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ



ఉడకబెట్టిన కోడిగుడ్లు

**కోటపల్లి:** మండలంలోని ఆలుగామ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన పల్లె శ్రావణ్ భార్య గర్భిణి కావడంతో గురువారం అంగన్‌వాడీ టీచర్ కోడిగుడ్లు పంపిణీ చేసింది. శుక్రవారం ఉడికించగా దుర్వాసన రావడంతో పరిశీలించారు. కోడిగుడ్లు కుళ్లిపోయినట్లు గుర్తించి అంగన్‌వాడీ కేంద్రం టీచర్‌ను శ్రావణ్ ప్రశ్నించాడు. తమకు వచ్చిన కోడిగుడ్లను పంపిణీ చేశామని టీచర్ చెప్పడంతో చేసేదేమీ లేక వెనుదిరిగాడు. కాగా, అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిన్నారులకు కోడిగుడ్లు వండించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా అవి కూడా దుర్వాసన రావడంతో పడేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఐసీడీఎస్ సీడీపీవో మనోరమను సంప్రదించగా.. కుళ్లిన కోడిగుడ్ల విషయం తమ దృష్టికి రాలేదని, చెడిపోయిన కోడిగుడ్లను తొలగించి మంచివి అందిస్తామని తెలిపారు. కాగా, మండలంలో గత రెండు నెలల్లో ఇది నాలుగో ఘటన కావడం గమనార్హం. కుళ్లిన కోడిగుడ్లతో చిన్నారులు, బాలింతలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నా ఐసీడీఎస్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

### షాపులో చోరీ



షటర్ తాళాలు పగులకొట్టిన దృశ్యం

**నిర్మల్‌టౌన్:** జిల్లాకేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో మోటార్ వైండింగ్ షాపులో గురువారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం షాపు షటర్ తాళం పగులగొట్టి ఉండడం చూసి యజమాని పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రూ.4 లక్షల విలువ గల 9 క్వింటాళ్ల రాగి తీగ ఎత్తుకెళ్లినట్టు సమాచారం.

**తాళం వేసిన ఇంట్లో..**

జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌లో తాళం వేసిన ఓ ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పట్టణ ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. యజమాని భూమయ్య తన బంధువుల ఇంట్లో జరిగే వేడుకకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో 8 గ్రాముల బంగారం, 2 తులాల వెండి, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులు, యజమానికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### అధిక సాంద్రత సాగుతో లాభాలు అధికం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శివకృష్ణ, సునీల్ మహాజన్

**బెల్లంపల్లిరూరల్:** పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ, జాతీయ పత్తి పరిశోధనసంస్థ నాగ్‌పూర్ ప్రధాన శాస్త్రవేత్త సునీల్ మహాజన్ అన్నారు. మండలంలోని మాలగురిజాల శివారులో అధిక సాంద్రత పద్ధతి ద్వారా రైతులు సాగు చేస్తున్న పత్తి పంటలను శుక్రవారం సందర్శించారు. సాగులో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 425 ఎకరాల్లో రైతు క్షేత్ర ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, రైతులు ఉన్నారు.

### కల్వర్టును ఢీకొన్న వాహనం

**భైంసారూరల్:** భైంసా–బాసర ప్రధాన రహదారిపై దేగాం సమీపంలో వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వాస్టర్ సాయినాథ్ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు..భైంసాలోని భట్టిగల్లీకి చెందిన డ్రైవర్ వాస్టర్ సాయినాథ్ (34) శుక్రవారం భైంసా నుంచి యూరియా బస్తాలతో వాహనంలో బాసరకు వెళ్తున్నాడు. ఈక్రమంలో కల్వర్టును ఢీకొనడంతో సాయినాథ్ సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అన్నిరంగాల్లో అగ్రగామిగా ట్రిపుల్‌ఐటీ

- ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్



క్యాంపస్‌లో అధికారులతో మాట్లాడుతున్న వీసీ

**భైంసా:** బాసర ట్రిపుల్‌ఐటీని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీకి శుక్రవారం చేరుకున్న ఆయనకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగీ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం క్యాంపస్‌లోని వీసీ చాంబర్‌లో వర్సిటీ స్థితిగతులపై ప్రొఫెసర్ గోవర్ధన్ సమీక్ష నిర్వహించారు. అనంతరం మెస్‌లను పరిశీలించారు. డైనింగ్‌హాల్, కిచెన్, స్టోర్‌రూంలను పరిశీలించారు. పరిశుభ్రతతోపాటు మెస్‌లలో వినియోగించే వస్తువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పరిపాలన భవనంలో అసోసియేట్ డీన్స్, స్టూడెంట్ వెల్ఫేర్ అధికారులతో సమావేశమయ్యారు. ట్రిపుల్‌ఐటీలో పోస్టుల వివరాలు, అకడమిక్ క్యాలెండర్, వసతి గృహాల వివరాలు, విద్యార్థుల సంఖ్య ఇలా పలు అంశాలను అడిగితెలుసుకున్నారు. ట్రిపుల్‌ఐటీలో సాంకేతిక విద్యతోపాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తు విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీసి అందుకు అవసరమయ్యే నూతన కోర్సులు ప్రవేశపెడతామని తెలిపారు. విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. ప్రభుత్వంతో సంప్రదించి పెండింగ్ పనులు ఉంటే పూర్తిచేయిస్తామని పేర్కొన్నారు. ట్రిపుల్‌ఐటీలో ఫైనాన్స్ సెక్షన్, స్కాలర్‌షిప్ సెక్షన్, అకడమిక్ సెక్షన్, స్టూడెంట్ వెల్ఫేర్ సెక్షన్, లైబ్రేరీతోపాటు పలు సెక్షన్‌లలో తనిఖీల గురించి అడిగితెలుసుకున్నారు. ట్రిపుల్‌ఐటీలో సమస్యలు పరిష్కరించడమే తన ముందు ఉన్న ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- 1.5 కిలోల గంజాయి, ఒక వ్యాన్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

**ఆదిలాబాద్‌రూరల్:** వివిధ ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్న కేసులో నలుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాలతో గతనెలలో తలమడుగు పోలీసుస్టేషన్ పరిధిలో మహారాష్ట్రతో అనుసంధానంగా ఉన్న లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్ద భారీఎత్తున గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఆ కేసులో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలోని బుల్దాన జిల్లాకు చెందిన గోతిరాం గురుదయాల్ సాబ్లే, శుభం గోతిరాం సాబ్లే, అమర్‌సింగ్ నారాయణ గోతి, సోమనాథ్ బికా అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి, ఒక వ్యాన్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న ఆదిలాబాద్ రూరల్, జైనథ్ సీఐలు ఫణిధర్, సాయినాథ్, ఎస్సై ముజాహిద్, పోలీసు సిబ్బంది రుక్మారెడ్డి, గంగాధర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులను ఎస్పీ అభినందించి, నగదు పురస్కారం ప్రకటించారు.

# రాపల్లిలో పరస్పర దాడులు

- మంచిర్యాల ప్రైవేట్ ఆస్పత్రిలో నాటకీయ పరిణామాలు
- ఇరువర్గాల్లో పలువురికి గాయాలు, చికిత్స



మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



గాయపడిన శ్రీనివాస్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** ఇరువర్గాలపై జరిగిన దాడులకు రాజకీయ రంగు పులుముకుంది. శుక్రవారం హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నేత, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకుల మధ్య జరిగిన పరస్పర దాడులు చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ ఉదయం రాపల్లి వైపు వెళ్తుండగా పునరావాస కాలనీ సమీపంలో తంగెళ్ల రామేశ్, తంగెళ్ల సాగర్, దేనవేణి రాజశేఖర్‌లకు మధ్య గొడవ జరిగింది. శ్రీనివాస్ రోడ్డుకు కారు అడ్డంగా పెట్టడం, తమ బైక్ ఢీకొనడం వల్ల తమకు గాయాలయ్యాయని ఇరువర్గాల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఒకరిపై ఒకరు చేసుకున్న దాడుల్లో ఇరువురికి గాయాలు కాగా మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆయన్ను పరామర్శించారు. శ్రీనివాస్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో పోలీసులకు సహకరించినా పార్టీ కార్యకర్తలు అడ్డుకునే క్రమంలో తోపులాట చోటు చేసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాస్ గురించి ఆరా తీయగా తీసుకురాలేదని చెప్పడంతో అంతా కంగుతిన్నారు. చివరకు లక్సెట్టిపేట కోర్టుకు తరలించనట్లు తేలడంతో తదుపరి చర్యలకు ఉపక్రమించారు. కాగా, తన భర్త శ్రీనివాస్‌పై అన్యాయంగా దాడి చేసి గాయపర్చారని మాజీ ఎంపీపీ స్వర్ణలత అన్నారు.

### ప్రభుత్వ ఆస్పత్రిలో మరోవర్గం బాధితులు

పరస్పర దాడిలో గాయపడిన మరోవర్గం బాధితులు తంగెళ్ల రామేశ్, తంగెళ్ల సాగర్, దేనవేణి రాజశేఖర్ మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను కాంగ్రెస్ నాయకులు తోట రావు, శ్రీనివాసగౌడ్, సతీశ్‌రావు, దొమ్మటి సత్తయ్య, బొడ్డు శంకర్ తదితరులు పరామర్శించారు. దాడి ఘటనపై బాధితులు ఫిర్యాదు చేశారు.

### ఇరువర్గాలపై కేసులు

ఇరువర్గాల వారు ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై చాంద్ తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్‌పై 109, 307, 324, రెడ్ విత్ 34 సెక్షన్ నమోదు కాగా, తంగెళ్ల రమేశ్, సాగర్, దేనవేని రాజశేఖర్‌లపై 324, రెడ్ విత్ 34 సెక్షన్ నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..రాపల్లి గ్రామానికి చెందిన తంగెళ్ల రమేశ్, తంగెళ్ల సాగర్, దేనవేని రాజశేఖర్‌ల మధ్య పాత గొడవలు కక్షల కారణంగా మాజీ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్ తన కారుతో వారిని అడ్డగించి ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. ఇందులో తంగెళ్ల రమేశ్ కాలు విరిగిపోగా రాజశేఖర్, సాగర్‌కు గాయాలయ్యాయి. అయితే వీరి దాడిలో శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి.



### త్రుటిలో తప్పిన ప్రమాదం



డివైడర్ ఎక్కిన లారీ

**బెల్లంపల్లి:** హైదరాబాద్–చంద్రపూర్ నేషనల్ హైవే 363పై రోడ్డు ప్రమాదం త్రుటిలో తప్పింది. గురువారం సాయంత్రం ఆసిఫాబాద్ వైపు నుంచి మంచిర్యాలకు లారీ వెళ్తోంది. బెల్లంపల్లి బైపాస్ వద్ద లారీ టైర్ పగిలి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ సమయంలో వాహనాలేవి రాకపోవడంతో ప్రమాదం తప్పింది. టూటౌన్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ కోసం నేషనల్ హైవే అధికారులకు సమాచారం అందజేశారు. శుక్రవారం కొత్త టైర్ మార్చి లారీని తీసుకువెళ్లారు.

### అదుపుతప్పి లోయలో పడ్డ కారు



బోల్తాపడ్డ కారు

**రామకృష్ణాపూర్:** రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్కే ఓసీ, అమరవాది చెరువు సమీపంలో శుక్రవారం ఓ కారు అదుపుతప్పి చిన్న లోయలో పడింది. పట్టణానికి చెందిన కిరణ్ శ్రీరాంపూర్ నుంచి ఆర్కేపీకి వస్తుండగా కారు అదుపుతప్పి స్తంభాన్ని వేగంగా ఢీకొని లోయలో పడిపోయింది. కాగా, కిరణ్‌కు ప్రాణాపాయం తప్పింది.

### కడుపునొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్య



లింగయ్య (ఫైల్)

**దండేపల్లి:** కడుపునొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కాసిపేటకు చెందిన చిరుత లింగయ్య(44)కు గత రెండేళ్ల క్రితం లివర్ చెడిపోవడంతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నా డు. కొన్నిరోజులు బాగానే ఉన్న అతనికి ఈ మ ధ్య కడుపునొప్పితో బాధపడుతున్నాడు. స్థానికంగా చికిత్స చేయించుకున్న నయం కావడం లేదు. పెద్ద ఆసుపత్రికి వెళ్దామంటే ఆర్థికంగా ఇబ్బందులు ఉండటం, తీవ్ర మనస్తాపంతో శుక్రవారం తెల్లవారుజామున గడ్డిమందు తాగి వాంతులు చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం లక్సెట్టిపేటకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య సుజాత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**పురుగుల మందు తాగి వ్యక్తి..**



మృతుడి వివరాలు సేకరిస్తున్న ఏఎస్సై పోశెట్టి

**వాంకిడి:** మద్యానికి బానిసై వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై పోశెట్టి కథనం ప్రకారం..మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన మస్నే రావుజీ(45) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. డబ్బులు లేని సందర్భాల్లో ఇంట్లో వస్తువులు అమ్మి మద్యం కొనుగోలు చేసుకునేవాడు. కుటుంబ సభ్యులు ఎంత సముదాయించినా మార్పు రాలేదు. ఈక్రమంలో గురువారం సాయంత్రం జీవితంపై విరక్తితో రావుజీ.. పశువుల కొట్టంలో పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. భార్య మస్నే సునీత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

**తాంసి మండలంలో ఒకరు..**




మృతదేహన్ని పరిశీలిస్తున్న తాంసి ఎస్సై శివరాం

**తాంసి:** పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని వడ్డాడి వద్ద మత్తడివాగు ప్రాజెక్టు సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై శివరాం కథనం ప్రకారం..ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన చౌదారపు హరికృష్ణ (27) గత కొంతకాలంగా మానసిక వ్యాధి తో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం ఆలయానికి వెళ్తున్నానని ఇంట్లో వారికి చెప్పి బైక్‌పై బయల్దేరాడు. మత్తడివాగు ప్రాజెక్టు వ ద్ద చేరుకుని పురుగుల మందు తాగి ఆత్మహ త్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి అందించిన సమాచారంతో ఎస్సై అక్కడికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తల్లి అరుణ పిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, మృతుడి సోదరుడు సాయికృష్ణ 2019లో మత్తడివాగు ప్రాజెక్టు వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

**జీవితంపై విరక్తితో ఒకరు**

**ఆదిలాబాద్‌టౌన్:** జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై అశోక్ కథనం ప్రకారం..ఖుర్షాపూర్‌కు చెందిన హన్మాండ్లు (35)కు తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. సంతానం కావడం లేదని భార్య రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుంది. దీంతో మనోవేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి రాములు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**ఉరేసుకుని యువకుడు..**



డొంగ్రే సచిన్(ఫైల్)

**కుంటాల:** మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన యువకుడు డొంగ్రే సచిన్ ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై రాందాస్ కథనం ప్రకారం.. సచిన్ (29) మద్యానికి బానిసయ్యాడు. పైగా అప్పులు చేసి తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్లాబ్‌కు నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మానిక ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

**మద్యానికి బానిసై వ్యక్తి**



షేక్ అహ్మద్ మృతదేహం

**ముధోల్:** మద్యానికి బానిసై వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్య కు పాల్పడినట్లు ఏఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని తరోడా గ్రామానికి చెందిన షేక్ అహ్మద్(50) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.